# వీడ్కోలు

డా. దుట్టా శ్యమంతకమణి

కథ


1950 వ సంవత్సరం. ఆంధ్ర ప్రదేశ్‌లో ఓ గ్రామం.

''ఆ..నిజమా?''

''అవును. ఇప్పుడే తెలిసింది. బండి ఊరి పొలిమేర దాటిన వెంటనే ప్రాణం గాలిలో కలిసిపోయిందట.''

''పాపం బ్రతికున్నంతకాలం..మా నాన్న అస్థికలు కాశీలోని గంగానదిలో కలిపివచ్చి, ఊరంతా అన్నసంతర్పణ చేయాలి అనేవాడు. ఆ కోరిక తీరకుండానే తాను కూడా వాళ్ల నాన్న దగ్గరకు వెళ్లిపోయాడు.''

''ఏం చేస్తాం. కాలం తీరిపోయింది. ఈ దగ్గర్లో ఎక్కడా సరైన వైద్యసౌకర్యాలు లేవాయె. సూదిమందు కోసం వెళ్లేలోపే ఆ పై లోకాల కెళ్లిపోతున్నారు. పాపం అన్నపూర్ణమ్మ. ఆ పిల్లలతో జీవితం ఎలా లాగుతుందో?''



''పెనిమిటి లేని లోటు ఎవ్వరూ తీర్చలేరనుకో. పొలాలు అవీ చూసుకోవటానికి బంధువులున్నారుగా! ఇక ఊరిలో ఏ సాయం కావాలన్నా మనమంతా లేమా? ఆ యిల్లంతా ఏడుపులతో గగ్గోలుగా వుంది. పాడె కదిలితే గానీ, ఆ వాడకట్టులో ఎవ్వరూ పొయ్యి వెలిగించరు. మనమే కాస్త తాలింపు పిండి, మజ్జిగ పంపుదాం!''

''బంధువులు ఓ వందమంది వచ్చారు. ఇంకా వస్తారు కూడా! మధ్యాహ్నం వంట కూడా మనమే చేసేద్దాం''

''అయితే ఇంకెందుకు ఆలస్యం? పాలేరు సాంబయ్య కుటుంబం మనకు సహాయానికి ఉన్నారుగా! వంట ప్రారంభించుదాం'' అంటూ విశాలాక్ష్మి పొయ్యి వెలిగించింది.

పరంధామయ్యగారి పార్థివ శరీరం వెంట ఊళ్ళో మగవాళ్లందరూ స్మశానానికి వెళ్లి కపాల మోక్షం వరకూ వుండగా, ఆడవాళ్ల ఇల్లు అలకడం, పసుపునీళ్ల చల్లుకోవడంలో నిమగ్నమయ్యారు. ఊరంతా తల స్నానాలు చేశారు. మనస్సులో విచారం మాత్రం తొలగిపోలేదు. విశాలాక్ష్మి లక్ష్మమ్మలు పంపిన వంట 'చిన్న దినానికి' సరిపోయింది.

11వ రోజున వెయ్యి విస్తర్లు లేచాయి. ఆ మర్నాడు వియ్యాలవారి విందు అంటూ మరో 500 విస్తర్లు.

అన్నపూర్ణమ్మ శేషజీవితం ఆ యింట్లోనే, ఆ గ్రామంలోనే అందరిమధ్యా ఎటువంటి ఒడిదుడుకులూ లేకుండా సాగిపోయింది. ఓ దశాబ్దం తర్వాత పరంధామయ్యగారి పెద్దకొడుకు 'కాశీయాత్ర' చేసివచ్చి ఊరంతా అన్నసంతర్పణ చేసి అయినవాళ్లకు, పనివాళ్లకూ బట్టలు పెట్టాడు.

★ ★ ★

ఓ పాతికేళ్ల తర్వాత..ఓ ఉదయం.

''ఏమిటి కమలా? ఏదో గందరగోళంగా వుంది?'' కాఫీ అందుకుంటూ భార్యను అడిగాడు రఘురాం!

''మన వీధిలో ఉండే రిటైర్డ్ మాస్టారు రామారావుగారు రాత్రి నిద్రలోనే చనిపోయారట. కబురు తెలిసి అయినవాళ్లు, తెల్సిన వాళ్లందరూ వస్తున్నారు.''

''మనిషి మంచితనం తన చావులోనే తెలిసిపోతుందంటారు మన పెద్దలు. ఎలాంటి అనారోగ్యం లేకుండానే ఆయన ప్రాణం హాయిగా వెళ్లిపోయింది. బ్రతికినంతకాలం అందరికీ ఎంతో సహాయంగా ఉండేవారు. శుభాశుభాల్లో పిలిచినా, పిలవకపోయినా వచ్చి సహాయంగా నిలబడేవారు. ఇలాంటి సమయాల్లోనే నలుగుర్నూ ఉండాలి. నేను ఈ రోజు ఆఫీసుకి శెలవు పెడతాను. వాళ్ల కుటుంబా

నికేమన్నా అవసరం ఉందేమో కనుక్కోలేకపోయావా?''

''ప్రొద్దున్నే పనిమనిషి మంగమ్మని పంపించాను. దాదాపు 50 మంది ఉన్నారట. ప్రక్కవాళ్లు ఉప్మా, టీ పంపించారట. ఇరుగుపొరుగు వాళ్ళం ఇంటికోరకం వంటచేసి మధ్యాహ్నం శవయాత్ర తర్వాత పంపుదామనుకుంటున్నాం. మనవంతు బంగాళదుంప కూర, మీరు బజారుకెళ్లి కావాల్సినవి తీసుకురండి''

''సరే అయితే, ఆ సంచి ఇలా ఇవ్వు'' అంటూ హేంగర్ పైనున్న షర్ట్ వేసుకుని బయటకు వెళ్లిపోయాడు రఘురాం.

కమల తన భర్తకు, పిల్లలకు క్యారేజీలు సర్ది సమయానికి వారిని బయటకు పంపాలన్న గృహస్థ ధర్మంతో ఆగిపోయింది గానీ, ఉదయం వార్త తెలిసిన దగ్గరనుంచీ ఆమె మనసు మనసులో లేదు. శ్యామలగార్ని పరామర్శించాలని ఆత్రపడుతుంది. మాస్టారి చాటునే ఆవిడ జీవితం ఇన్నేళ్ళూ గడచిపోయింది. ఇకనుంచీ ఒంటరి జీవితం. నలుగురి పిల్లల్లో ఎవరివద్ద ఉంటుందో? లేక స్వంత యిల్లే గదా! ఇక్కడే ఉండిపోతుందో? అయినా ఆ నలుగురి బిడ్డలకు ఆ తల్లి భారమా? ఇలా రకరకాల ఆలోచనలతోనే పని ముగించింది.

''ఇవిగో కూరలు..పనయిన వెంటనే ఇల్లు తాళం పెట్టి నువ్వు వచ్చెయ్యి!'' అంటూ పని పురమాయించి వెళ్లిపోతున్న భర్త వైపు చూసి, 'ఉల్లిపాయలు వలిస్తే నేను కూడా కాస్త త్వరగా తెములుతాను గదా!' అని మనస్సులో అనుకుంది కమల. కానీ పైకనలేదు.

''ఓ గంటాగి ఈ కూర గిన్నె తీసుకురా'' అంటూ పనిమనిషికి పురమాయించి రామారావు గారి 'ఆఖరి చూపు'లకు వెళ్లింది కమల. రాత్రి నుంచీ ఏడుస్తూనే ఉన్నారేమో, శ్యామలమ్మగారి మొహం ఉబ్బివుంది. ఆమె ప్రక్కనే కూలబడింది కమల.

కొన్ని సందర్భాలలో మనస్సు మూగబోయి మాటలు గొంతునుండీ బైటకురావు. ప్రస్తుతం కమలది కూడా అదే స్థితి.

పాడె ఎత్తారు. వాతావరణం అంతా ఏడుపులతో దద్దరిల్లిపోయింది.



## ఇంకా దోస్తులేనట!

కత్రినా కైఫ్-సల్మాన్ ఖాన్‌ల దోస్తీ గురించి బాలీవుడ్‌లో జోరుగానే వినిపిస్తూ వుంటుంది. అయితే ఇటీవల కాలంలో ఇద్దరి మధ్యా ఏవో తేడాలొచ్చి దూరమయ్యారనే వార్తలు ఇటీవల వచ్చాయి. కానీ ఇప్పటికీ తనకి సల్మాన్ ఖాన్ మార్గదర్శి అని, తన కెరీర్ చక్కగా ముందుకు సాగేందుకు తగిన సలహాలు ఆయనే ఇస్తున్నాడని తాజాగా చెబుతోంది కత్రినా. సల్మాన్ సొంత చిత్రం 'దబంగ్'లో హీరోయిన్‌గా తనను కాకుండా సొనాక్షిని తీసుకోవడం తనకేమీ కోపం తెప్పించలేదనీ, ఆ పాత్ర తనకి సరిగ్గా నప్పదు కాబట్టే తను చేయలేదని సెలవిచ్చింది కత్రినా.

11వ రోజు 300మంది 'దినం భోజనం' చేశారు. సాయంత్రమే 'వియ్యాలవారి విందు' కన్నబిడ్డలు తప్ప అందరూ వెళ్లిపోయారు.

ఆ రాత్రి కుటుంబసభ్యుల సమావేశం!

''అన్నయ్యా! రేపు మేము కూడా బయలుదేరుతాం. అమ్మ పరిస్థితి ఏమిటి?'' చిన్నచెల్లి ప్రారంభించింది సంభాషణ.

''ఐదునెలలు ఎవరి ఇంటికీ వెళ్ల కూడదుగదా! అప్పుడు ఆలోచిద్దాం'' పెద్దవదిన సమాధానం.

''అంతవరకూ ఒక్కతే ఎలా ఉంటుంది?'' పెద్దకూతురి ఆందోళన.

''ఆ..ఏముంది? కాస్త జీతం ఎక్కువ ఇచ్చి పనిమనిషిని ఇంట్లోనే ఉండమని చెబుదాం. ఎలాగూ ఆమెకూ ఎవ్వరూలేరు కాబట్టి తన ఖర్చు అంతా మనమీద వెళ్లిపోతుంది. జీతం మిగిలిపోతుంది'' బ్యాంకు ఉద్యోగిని అయిన చిన్నకోడలు పరిష్కారం చూపించేసింది.

''ఐదవ నెల తర్వాత అందరూ ఓ రెండువారాలు శెలవు పెట్టండి. కాశీ వెళ్లి నాన్నగారి అస్థికలు నిమజ్జనం చేసి వద్దాం. ఇల్లు అద్దెకిద్దాం. అమ్మకిష్టమైన చోట ఉంటుంది'' పెద్దకొడుకు పెద్దరికంతో చేసిన నిర్ణయం.


''అదే కరక్ట్..ఎలాగూ నాన్నగారి పెన్షన్ వుంది కాబట్టి మనం ఎవ్వరం డబ్బు పంపనవసరం లేదు. ఇంటద్దె..అమ్మ ఎవ్వరివద్ద ఉంటే ఆ కుటుంబానికిద్దాం'' భార్య డబ్బుల

లెక్కలు తనకూ అబ్బిన చిన్నకొడుకు.

''అలా అయితే ఒక్కొక్కరి ఇంట్లో మూడు నెలలుంచుకుందాం'' చిన్న అల్లుడి ఆలోచన.

''ఇది కరెక్ట్. అప్పుడు అత్తయ్యగారు ఎవ్వరికీ భారంకారు. ఆధారపడిన భావన ఆవిడకూ వుండదు'' పెద్దల్లుడి పెద్దమనస్సు.

మొత్తానికి అందరూ కలిసి శ్యామలమ్మగారి శేష జీవితాన్ని ప్లాన్ చేసేశారు. భర్తా, తాను గడిపిన ఆ యింట్లోనే ఉండిపోవాలని, పిల్లలు తన దగ్గరకూ వచ్చీ వెళుతుంటే బావుండునన్న కోరిక మనస్సులో ఉన్నప్పటికీ ఆ పిల్లల నిర్ణయానికి తలవొగ్గిందా మహాయిల్లాలు.




రెండురోజుల తర్వాత అందరూ వెళ్లిపోయారు. అప్పుడప్పుడూ పలకరించే ఇరుగూ పొరుగూ! రేడియోతో సహచర్యం. పనిమనిషితో కలిసి బజారుకి, కూరగాయలకు, బ్యాంకుకి వెళ్లడం అలవాటయ్యింది శ్యామలమ్మగారికి.

అనుకున్న ప్రకారం ఐదునెలల తర్వాత 'కాశీ' వెళ్లి తొమ్మిది రోజులుండి, చుట్టుప్రక్కల ప్రదేశాలన్నీ చూసి వచ్చారు. ఇల్లు అద్దెకు, శ్యామలమ్మగారు మొదటి వాయిదాగా పెద్దకొడుకింటికి వెళ్లారు.

★ ★ ★

కాలగర్భంలో మరో 25 వసంతాలు గడచిపోయిన తర్వాత వచ్చిన కార్తీకమాసంలో ఓ సోమవారం ఉదయం.

''బస్సు వచ్చేసింది. అందరూ త్వరగా రావాలి'' ఓ ఇంజనీరింగ్ స్టూడెంట్ హ్యాండ్‌మైక్‌లో అరుస్తుండగా, అపార్ట్‌మెంట్‌లోని కుటుంబాలు కోలాహలంగా వచ్చి బస్సెక్కసాగారు.

బాల్కనీలో కూర్చున్న రాధమ్మ..ఆ హడావుడి గమనిస్తూ సాయంత్రం వ్రతం కోసం ఉపవాసాలున్నవారు, అనారోగ్యంతో ఆగిపోయినవాళ్లు, దాదాపు ఓ ఇరవై మంది మిగిలిపోయి ఉండవచ్చు. సాయంత్రం వరకూ మరలా అంతా నిశ్శబ్దమే అనుకుంటుండగా కృష్ణమూర్తి దగ్గు వినబడింది.

మూడు సంవత్సరాల నుంచీ అతను మంచంలోనే!

వయస్సులో వుండగా పేరుకుతగ్గ మనిషే! ఎంతోమంది స్త్రీలు తమ మధ్యకు వచ్చి వెళ్లారు. అందుకే తమమధ్య బలమైన అనురాగబంధంగానీ, ఇలాంటి పిక్నిక్‌లు, షికార్లు ఏమీలేవు. పిల్లల భవిష్యత్తుని దృష్టిలో వుంచుకుని వైవాహిక బంధానికి విలువిస్తూ ఉండిపోయింది తప్ప ప్రేమతో కాదు. రాధమ్మను సుఖపెట్టిందిగానీ, ఆర్థికంగా కూడగట్టినదిగానీ ఏమీలేదు. పిత్రార్జితమైన యిల్లు తప్ప. రోగిష్టి భర్తకు సేవలు, ఇంటికి సేవా చేయలేకపోయిందామె. ఉపాధి వనరులు పెరగడం వలన ఇదివరకులా పని మనుషులు దొరకడం లేదు. అందుకే తెగించి ఇల్లు అమ్మేసింది. ఇద్దరు కూతుర్లూ ఇదే ఊరిలో ఉంటారు. వాళ్లకు కొంత సొమ్ము పంచి ఇచ్చేసి, ఓ సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ తన పేరున కొనుక్కుని అవసరాల కోసం కొంతడబ్బు బ్యాంకులో వేసింది. వాచ్‌మెన్ సహాయంతో దుప్పటి బట్టలు మారుస్తూ, కాస్త ఎక్కువ సొమ్ము ఇచ్చి నిత్యావసరాలు తెప్పించుకుంటూ కృష్ణమూర్తికి సేవలు చేస్తూ ఆ అపార్ట్‌మెంట్లో 'అందరిమధ్యా ఒంటరి జీవితం' సాగిస్తూ కాలం గడుపుతుందామె.

''కేదారేశ్వర వ్రతానికి పక్కింటికి వెళుతున్నా'' అంటూ చెప్పటానికి భర్తను తట్టిందామె. చల్లబడిపోయిన కృష్ణమూర్తి శరీరం



## గ్లామర్ సీక్రెట్

**అనుష్క నటిస్తున్న నాలుగో తమిళ చిత్రం 'వానమ్' (వేదం) త్వరలోనే విడుదలవుతోంది. ఇప్పటికే తెలుగులో తనదైన క్రేజ్ సంపాదించుకున్న అనుష్క ఈ సినిమా తర్వాత అక్కడ మరింత పాపులర్ అవుతుందని సినీవర్గాలు భావిస్తున్నాయి. తనదైన గ్లామర్ సొంతం చేసుకున్న అనుష్కను మీ గ్లామర్ సీక్రెట్ ఏంటని అడిగితే- 'ఏం లేదు! రోజూ కనీసం అరగంటైనా ఎక్సర్‌సైజ్‌లు చేస్తాను. అలాగే నీళ్లు బాగా తాగుతాను. రాత్రి పూట 8 గంటలలోపే భోంచేస్తాను. అంతే' అని చెబుతోంది.**

ఆయన ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయిన విషయం చెప్పేసింది. ఆమెకు ఏడుపు తన్నుకు రాలేదు. 'ఇదీ' అని వ్యక్తీకరించలేని ఓ భావన. ఓ నిట్టూర్పు.


కొంచెం సేపటికి తేరుకుని 'మెయిన్ డోర్' మూసేసింది. ఇక ఎవ్వరూ తమను డిస్టర్బ్ చేయరు. 'ఎలాగూ పోయిన ప్రాణం తిరిగి రాదు. అపార్ట్‌మెంట్‌లో మిగిలినవారికి తెలియడం వలన ఉదయం నుంచీ వాళ్లందరూ ప్లాన్ చేసుకున్న వాళ్ల పూజా కార్యక్రమాలు పాడవ్వచ్చు. 'మా ఫ్లాట్‌లో కాదుగా' అనుకున్నా మనశ్శాంతిగా పూజల్లో పాల్గొనలేరు. అలాగే కొందరు రాత్రి ప్రశాంతంగా నిద్రపోలేకపోవచ్చు. పాపమో, పుణ్యమో, నాదే తప్పు ఎవ్వరిదీ కాదు.

కూతుర్లు కూడా 'వ్రతం' పెట్టుకున్నారు. కాబట్టి అందరికీ కాస్త లేటుగానే చెప్పాలని నిర్ణయించుకుంది. తొమ్మిది గంటల తర్వాత కూతుళ్ళకు ఫోన్ చేసి చెప్పింది. గత మూడు సంవత్సరాలుగా ఊహిస్తున్న విషయమే గాబట్టి పెద్దగా గందరగోళం లేదు. ప్రొద్దున్నే చీకటితో వస్తామన్నారు. ఇరుగుపొరుగుకి కూడా అప్పుడే చెప్పాలని నిర్ణయించుకుంది రాధమ్మ.

'రేపటి నుండీ ఈ తోడు కూడా వుండదు' అనుకుంటూ కుర్చీలో కృష్ణమూర్తి ప్రక్కన కూలబడింది.

పాలప్యాకెట్ల వ్యాను చప్పుడువిన్న రాధమ్మ లేచి వెళ్లి సెక్రటరీ ఫ్లాట్ కాలింగ్ బెల్ నొక్కింది. ఎర్రబడిన ఆమె కళ్లు చెబుతున్న విషయం అర్థమయినా, తొందరబడటం ఎందుకని ప్రక్కకు తొలగి, ''లోపలకు రండమ్మా'' అన్నాడాయన.

''రాలేను నాయనా! ఈ ఇరవై వేలు వుంచి ఆయన అంతిమ యాత్రకు ఏర్పాటు చేయండి'' అంటూ పైకం చేతికందించింది. 'డబ్బెందుకమ్మా' అనాలనుకున్నాడాయన. కానీ అనలేకపోయాడు. కారణం అన్ని సేవల ధరలు పెరిగిపోయాయి. మహా అయితే ఓ పూట శెలవుపెట్టి సాయం చేయగలడు తప్ప ఆర్థిక భారం వహించలేడు. ''మీరు వెళ్లండమ్మా! ఏర్పాట్లు నేను చేస్తాను'' అంటూ రాధమ్మను సాగనంపి మొబైల్‌లో ఒక్కొక్కరితో తమకు కావాల్సిన సేవల గూర్చి మాట్లాడసాగాడు.




కృష్ణమూర్తి కుటుంబం, ఆ వెనుక షామియానా, పూలదండలు వచ్చాయి. 'ఇంత ఉదయం హడావుడి ఏమిటో?' అనుకుంటున్న అపార్ట్‌మెంట్ వాసులకు వాచ్‌మెన్ వచ్చి శవయాత్ర 9 గంటలకు, సాయంత్రం ఇంటికొకరికి భోజనం అని చెప్పి వెళ్లాడు.

శవం వెళ్లేవరకూ స్నానం చేయకూడదన్న నియమం పెట్టుకుంటే ట్రాఫిక్‌లో తేలి, ఆఫీసులకు చేరేసరికి అపరాహ్ణం, అర్ధపూట శెలవు అని లెక్క వేసుకున్న ఇరుగుపొరుగు మర్యాద కోసం వచ్చి చూసి వెళ్లారు. కొడుకులు లేరుగాబట్టి దగ్గర బంధువులు మహాప్రస్థానంలో (శవాలను తీసుకు వెళ్లే వ్యాను) వెళ్లి విద్యుత్ దహనం చేయించి వచ్చారు.

సాయంత్రం క్యాటరింగ్ వాళ్లు వచ్చి వడ్డించి వెళ్లిపోయారు. లెక్కలు చెప్పి బిల్లులు చేతిలో పెడుతున్న సెక్రటరీతో ''చాలా థ్యాంక్సండీ'' ఇన్నాళ్ళూ మా అమ్మానాన్నలకు తోడుగా వున్నారు. ఈరోజు కూడా చాలా సహాయం చేశారు. ఇక ముందుకూడా మా అమ్మగారిని కాస్త పలకరిస్తూ వుండండి. మేము వీలు

## నో పాలిటిక్స్

**తమిళ సినీరంగంలో తనదైన గుర్తింపు సంపాదించుకుని అభిమానులతో గుడిని కూడా కట్టించుకునేంత క్రేజ్‌ని సొంతం చేసుకున్న సిమ్రాన్ ఇటీవల కాలంలో సినిమాల్లో నటించకపోయినా టీవీ సీరియళ్ల ద్వారా ప్రేక్షకులను పలకరిస్తూనే వుంది. త్వరలోనే ఆమె తమిళనాడు రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతోందనే వార్త ఈమధ్య బయటికొచ్చింది. దీనికి సిమ్రాన్ స్పందిస్తూ- 'నాకు రాజకీయాలంటే అస్సలు ఇంటరెస్ట్ లేదు. నేను రాజకీయాల్లో రాను. టీవీ సీరియల్స్ నిర్మిస్తూ, అవకాశాలను బట్టి సీరియల్స్‌లో నటిస్తూ హాయిగా గడిపేయాలనుకుంటున్నాను' అంది.**



చూసుకుని వస్తూ ఉంటాము అన్న పెద్దకూతురిని, అక్కమాటలకు 'సై' అంటున్న చిన్నకూతురిని చూసి 'ఆస్తులు పంచుకోగలరుగానీ, అమ్మను పంచుకోగలరా?' అనుకున్నాడా సెక్రటరీ!

ఉరుకుల పరుగుల ఉద్యోగాలు, అయినా ఆ పిల్లలకే చాలని ఆ డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లలో తాను ఎక్కడ ఉండగలదు? తనకు ఓ రూమ్ కేటాయించడమంటే వాళ్ల ఏకాంతానికి, పిల్లల చదువులకు ఇబ్బంది అని సరిపెట్టుకుంది రాధమ్మ. కానీ లోకంకోసమైనా, మాటవరుసకైనా 'మా దగ్గర ఉండమని' ఆహ్వానించని కూతుళ్లు, అల్లుళ్ల వైఖరితో మనసు చివుక్కుమంది.

ఎంతయినా మాతృహృదయం గదా! అందుకే ''పిల్లలను శెలవులకు పంపుతూ ఉండండమ్మా! నా సహాయం అవసరం అయితే ఫోన్ చేయండి'' అంటూ మర్నాడు వాళ్లను సాగనంపింది.

ఆ వేసవి శెలవుల్లో అపార్ట్‌మెంట్‌లోని ఓ కుటుంబం కాశీ వెళుతున్న విషయం తెలిసి, వాళ్లతో రిజర్వేషన్ చేయించుకుని వెళ్లి శాస్త్రోక్తంగా బ్రాహ్మణుల చేత పిండప్రదానం చేయించింది.

కలరే లేని ఆమె జీవితంలో కలర్ టీవీ తోడై శేష జీవితం గడచిపోయింది.

★ ★ ★

దేశాల సరిహద్దులు చెరిగిపోయి, భూగోళం అంతా ఒక యూనిట్‌గా ఖగోళమంతా అక్కడక్కడా గ్రహాల్లో మనుష్యులు జీవిస్తున్న 2050 సంవత్సరం.

ఆధునిక వైద్యం పుణ్యమా అంటు మనిషి సగటు ఆయుర్దాయం 100 సంవత్సరాలు అయ్యింది. మరణాల శాతం తగ్గినా, జనాభా పెరుగుదల తగ్గలేదు.

మాతృభాషల పరిరక్షణ తప్ప శ్రద్ధ లేకపోవడం వల్ల ఆంగ్లం తప్ప అన్ని భాషలు కూడా మృతభాషల లిస్టులోకి చేరిపోయాయి (గాబట్టి ఈ క్రింది సంభాషణ కూడా ఆంగ్లంలోనే)

నెం.77711560096878.. భూభాగం నుంచీ లలిత కాలింగ్...''

''నెం.89705738115 చంద్రమండలం నుంచీ రాహుల్ రెస్పాండింగ్''

ఇక్కడ అమ్మ, అక్కడ కొడుకు, సంధానకర్త కంప్యూటర్.. ''మీ నాన్నగారు 12.30 నిమిషాలకు చనిపోయారు''

''100 సంవత్సరాలు దాటి 6 నెలలయ్యింది గదా..సహజం''

''నువ్వూ కోడలు మనవడితో కలసి రాగలరా?''

''సారీ అమ్మా! ఖాళీ లేదు. మాధవి భారత దేశం చూడాలని అంది. అందుకే 2051లో ఓ పది రోజులు శెలవులో వస్తాం. సిట్యుయేషన్ నీవు మేనేజ్ చేయగలవా? మనిషి చనిపోతే ఏమేం చేయాలో తెలుసుగదా?''

''య్యా! తెలుసు. నువ్వేం వర్రీగాకు. నేను మేనేజ్ చేస్తాను''

''ఓకే మామ్! ఐ లవ్యూ! అయాం సారీ! ఇక నుంచీ నువ్వు ఒంటరివి''

''ఇట్స్ ఓకే! నువ్వు నా గురించి వర్రీ అవకు. ఏదో ఓ సామాజిక కార్యక్రమంలో భాగస్వామ్యం వహిస్తాను..బై డార్లింగ్''

కంప్యూటర్‌లో చంద్రగ్రహం కనెక్షన్ డిస్‌కనెక్ట్ చేసి, లోకల్ కనెక్షన్ ఆన్ చేసి, బంధువులకు, మిత్రులకు 'ఈ-మెయిల్' పంపింది. అదేవిధంగా ప్రభుత్వానికి కూడా!

వెంటనే అతని సోషల్ సెక్యూరిటీ నెంబరు ఆపివేసినట్లు అతని సెటిల్‌మెంట్స్ అన్నీ లలిత ఖాతాకి బదలాయించినట్లు, మరో అరగంటలో వచ్చే అంబులెన్స్‌కి ఆమె భర్త శవాన్ని అందజేయమని జవాబు వచ్చిందామెకి.

అరగంట తర్వాత పరశురాం శరీరం మెడికల్ కాలేజీకి డిసెక్షన్‌కి వెళ్లిపోయింది. పనికొచ్చే అవయవాలన్నీ తీసివేసి అనారోగ్యంతో ఉన్నవారికి అమర్చేశారు. ప్లాస్టిక్ సర్జరీకి పనికొచ్చేవిధంగా చర్మాన్ని రీసైక్లింగ్ యూనిట్‌కి పంపించేశారు.

2057లో లలితను చూడటానికి రాహుల్ కుటుంబం వచ్చింది. పరశురాం ఫోటో ముందు ఓ దీపం వెలిగించారు. ఎయిర్‌కార్‌లో ఓ పదిరోజులు భారతదేశయాత్ర చేశారు. అందులో కాశీ కూడా ఉంది. 10 రోజుల తర్వాత శాటిలైట్‌లో చంద్రమండలానికి వెళ్లిపోతున్న తన సంతానాన్ని చూస్తూ 'నేను చనిపోతే వీళ్లకు సమాచారం ఎవ్వరు ఇస్తారు? బహుశా నెట్‌లోనే అన్నీ అయిపోతాయి. వీడ్కోలు ఇచ్చే సమయం కూడా రాహుల్ వాళ్లకుండదు. అప్పుడు వీళ్లు ఈ భూమికి రావల్సిన అవసరమే ఉండదు' అనుకుంటూ 'సొసైటీ ఫర్ సింగిల్ అండ్ లోన్లీ వుమన్' సైట్‌లో అప్లికేషన్ పూర్తి చేసి 'సబ్మిట్' అని కొట్టింది. లలిత 'యువర్ అప్లికేషన్ యాక్సెప్టెడ్' అన్న మెసేజ్ చూసి 'కాలం మారినా, సమాజ పరిస్థితులు మారినా, మారనిది స్త్రీ జీవితంలోని ఒంటరితనం..మనస్సులో శూన్యం' అని నిట్టూర్చింది లలిత.

☆



# ఆయనంటే కోపం లేదు

**తమిళ దర్శకుడు సెల్వరాఘవన్ పెళ్లాడి సినిమాలకు గుడ్‌బై చెప్పిన గ్లామరస్ స్టార్ సోనీ అగర్వాల్ ఇటీవలే అతని నుంచి విడాకులు తీసుకుని తిరిగి సినిమాల్లో నటించేందుకు సిద్ధమైంది. అయితే తనకి తన మాజీ భర్త సెల్వరాఘవన్ అంటే ఎలాంటి కోపం లేదంటోంది. తను మళ్లీ సినిమాల్లో నటిస్తోంది కాబట్టీ ఎక్కడైనా ఎప్పుడైనా ఇద్దరూ తారసపడే అవకాశం వుంది కదా అంటే- అవును, మేమిద్దరం ఎదురుపడితే షేక్ హాండిచ్చి, పలకరిస్తాను తప్ప గుర్రుగా చూడను అంటూ సింపుల్‌గా చెప్పేస్తోంది.**